ప్రజా సేవతోనే ప్రజాప్రతినిధులకు గుర్తింపు

మున్సిపల్ చైర్‌పర్సన్ సుజాతను సన్మానిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల

- ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్
- మున్సిపల్ పాలకవర్గానికి ఆత్మీయ వీడ్కోలు

మెట్‌పల్లి, జనవరి 21: నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి కోసం పని చేసే ప్రజాప్రతినిధులకు ప్రజల్లో మంచి గుర్తింపు ఉంటుందని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు. మెట్‌పల్లి మునిపల్ కార్యాలయంలో పాలకవర్గం సాధారణ సమావేశం, పాలకవర్గం ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమాన్ని మంగళవారం చైర్‌పర్సన్ రాణవేని సుజాత అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ, మున్సిపల్ పాలకవర్గం బీఆర్ఎస్ హయాంలో పట్టణంలో అనేక అభివృద్ధి పనులు చేపట్టిందని గుర్తు చేశారు. ప్రజా సేవ చేసే నాయకులు ప్రజల హృదయంలో నిలిచిపోతారని పేర్కొన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రాణవేని సుజాత నేతృత్వంలో పట్టణంలో ప్రజా సంక్షేమం, అభివృద్ధి కోసం పాలకవర్గం పని చేసిందని ప్రశంసించారు. సమావేశంలో 40 అంశాలతో కూడిన ఎజెండాను ప్రవేశపెట్టగా కౌన్సిల్ సభ్యులు చేతులెత్తి ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. అనంతరం పాలకవర్గం పదవీ కాలం ఈనెల 26తో ముగియనున్న నేపథ్యంలో చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులను శాలువాలతో సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. మున్సిపల్ ఉపాధ్యక్షుడు బోయినపల్లి చంద్రశేఖర్‌రావు, కమిషనర్ మోహన్, డీఈఈ నాగేశ్వర్‌రావు, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారం చేస్తున్న కార్యవర్గ సభ్యులు

కార్యవర్గం ప్రమాణ స్వీకారం

మెట్‌పల్లి, జనవరి 21: మెట్‌పల్లి పట్టణంలో నాయీబ్రాహ్మణ సేవా సహకార సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం మంగళవారం నిర్వహించారు. అధ్యక్షుడిగా ముత్యాల రమేశ్, ఉపాధ్యక్షుడిగా నడికుడ పెద్దసాయన్న, కోశాధికారిగా చిట్యాల సత్యనారాయణ, సహాయ కార్యదర్శిగా సమ్మెట గంగాధర్, సహాయ కోశాధికారిగా పసునూరి సత్యనారాయణ, కార్యవర్గ సభ్యులుగా చింతకుంట రాజగంగారాం, నడిపొల్ల నడిపి ముత్తయ్య, బాలగంగాధర్, శ్రీహరి, చింతకుంట రవి, రాచకొండ లక్ష్మణ్ ప్రమాణ స్వీకారం చేశారు. నూతన కార్యవర్గాన్ని సభ్యులు శాలువాలతో సన్మానించారు.

సారంగాపూర్: బట్టపల్లిలో ఆత్మీయ భరోసా పథకం కింద ఒకే కుటుంబంలో ఇద్దరిని ఎంపిక చేశారని అభ్యంతరం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

కథలాపూర్: దుంపేట గ్రామసభలో ఇందిరమ్మ ఇండ్లు ఎంతమందికి ఇస్తారని అధికారులను ప్రశ్నిస్తున్న మాజీ సర్పంచ్ వేణు

గ్రామసభల్లో గందరగోళం

- పథకాలకు లబ్ధిదారుల ఎంపికపై విమర్శలు
- పలుచోట్ల అధికారుల నిలదీత

సారంగాపూర్, జనవరి 21: మండలంలోని బట్టపల్లి గ్రామంలో మంగళవారం రైతుభరోసా, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలకు లబ్ధిదారుల ఎంపిక కోసం మంగళవారం గ్రామసభ నిర్వహించారు. కాగా, పంచాయతీ కార్యదర్శి ఆయా పథకాలకు సంబంధించిన లబ్ధిదారుల ఎంపిక వివరాలను గ్రామ సభలో చదివి వినిపించారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద ఎంపిక చేసిన లబ్ధిదారుల జాబితాలో ఒకే కుటుంబంలో భార్యాభర్తలు, అన్నాచెల్లెలు, వివాహమై అత్తగారింటికి వెళ్లిన ఇద్దరు మహిళల పేర్లు ఉండడంతో గ్రామస్తులు, కూలీలు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఒకే కుటుంబంలో ఇద్దరికి జాబ్‌కార్డులు ఉన్నాయని వాటిని తొలగించాలని అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ జమీర్ మాట్లాడుతూ, అభ్యంతరాలు ఉన్న వాటిని పరిశీలించి తొలగిస్తామన్నారు. గ్రామసభల్లో బీర్‌పూర్ మాజీ ఎంపీపీ మసర్తి రమేశ్, మాజీ వైస్ ఎంపీపీ రాంచందర్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ భుక్యా సరళ, మాజీ ప్రజాప్రతినిధులు భుక్యా వరుణ్‌కుమార్, శ్రీలత-శ్రీనివాస్, లక్ష్మి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కథలాపూర్, జనవరి 21: కథలాపూర్ మండలం దుంపేట, దూలూర్, అంబారిపేటలో గ్రామసభలు నిర్వహించారు. కాగా, దుంపేటలో ఇందిరమ్మ ఇండ్ల కోసం 140 మంది దరఖాస్తు చేసుకోగా, ఎంత మందికి మంజూరు చేస్తారో గ్రామసభలో చెప్పాలని మాజీ సర్పంచ్ జెల్ల వేణు గోపాల్ అధికారులను పట్టుబట్టారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని అధికారులు పేర్కొన్నారు. భూమిలేని నిరుపేద కూలీలకు ఉపాధిహామీ జాబ్‌కార్డుతో సంబంధం లేకుండా రైతు ఆత్మీయ భరోసా మంజూరు చేయాలని దూలూర్ మాజీ సర్పంచ్ గుండారపు గంగాధర్ కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వినోద్, ఎంపీడీవో శంకర్, నాయబ్ తహసీల్దార్ శ్రీనివాస్‌గౌడ్, ప్రత్యేకాధికారులు అనిల్‌కుమార్, శ్రీనివాస్, యోగితా, ఆర్ఐ నాగేశ్, సోహేల్, పంచాయతీ కార్యదర్శులు వైభవ్, ఎండీ ఘనీ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

కోరుట్ల, జనవరి 21: క్రీడాలతో మానసికోల్లాసం, శారీరక దృఢత్వం పెంపొందుతుందని కలెక్టర్ సత్యప్రసాద్ పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో మంగళవారం నిర్వహించిన మాజీ మంత్రి జువ్వాడి రత్నాకర్‌రావు స్మారక కేపీఎల్ కరాటే క్రీడా పోటీలను ఆయన కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావుతో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, యువత చదువుతో పాటూ క్రీడలపై మక్కువ పెంచకోవాలన్నారు. వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. క్రీడా పోటీల నిర్వహణకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేస్తానన్నారు. యువత క్రీడల్లో జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మెట్‌పల్లి డీఎస్పీ రాములు, నాయకులు అన్నం అనిల్, గడ్డమీది పవన్, తిరుమల గంగాధర్, లక్ష్మీనారాయణ, నిర్వాహకులు బాలరాజు, మొయిజ్, ప్రజాప్రతినిదులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

విద్యుత్ లైన్లు వేయవద్దని గ్రామస్తుల ఆందోళన

గ్రామస్తులతో మాట్లాడుతున్న పోలీసులు

రాయికల్, జనవరి 21: రాయికల్ మండలం ఉప్పుమడుగు గ్రామం మధ్యలో నుంచి విద్యుత్ లైన్లు వేయవద్దని గ్రామస్తులు మంగళవారం రాయికల్-జగిత్యాల ప్రధాన రహదారిపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాయికల్‌లోని 33కేవీ సబ్‌స్టేషన్‌కు ఉప్పుమడుగు గ్రామం మధ్యలో నుంచి హైవోల్టేజీ విద్యుత్ లైన్లు ఏర్పాటు చేయవద్దని, ఇండ్లను ఆనుకొని విద్యుత్ స్తంభాలు వేయడంతో భవిష్యత్‌లో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. గ్రామం నుంచి విద్యుత్ లైన్లు వెళ్లకుండా చూడాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ సుధీర్ రావు వచ్చి విద్యుత్ శాఖ ఏఈ నవీన్‌తో మాట్లాడారు. 33 కేవీ సబ్ స్టేషన్‌కు సంబంధించిన విద్యుత్ లైన్లతో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తవని తెలిపారు. 11కేవీ విద్యుత్ తీగలకు దూరంగా 33 కేవీ విద్యుత్ లైన్లు ఏర్పాటు చేస్తున్నామని గ్రామస్తులకు నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు.

నామినేటెడ్ పదవుల్లో యాదవులకు ప్రాధాన్యమివ్వాలి

జగిత్యాల రూరల్, జనవరి 21: నామినేటెడ్ పదవుల్లో యాదవులకు ప్రాధాన్యమివ్వాలని యాదవ సంఘం అడహక్ కమిటీ జిల్లా అధ్యక్షుడు గనవేని మల్లేశ్ యాదవ్ కోరారు. జగిత్యాల మండలం కల్లెడ గ్రామంలో మంగళవారం ఆయన యాదవులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లేశ్ యాదవ్ మాట్లాడుతూ, యాదవ సంఘాన్ని జిల్లా వ్యాప్తంగా బలోపేతం చేసి హక్కులను సాధించుకుంటామన్నారు. సమావేశంలో యాదవుల సమస్యలు, హక్కులు, తదితర అంశాలపై చర్చించారు. అనంతరం యాదవ సంఘం సభ్యత్వాలను నమోదు చేసి, రసీదులు అందజేశారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం అడహక్ కమిటీ మండల ఇన్‌చార్జి బైరి మహేశ్, ఎం మహేశ్, జలంధర్, ఎరవేని వినోద్, జంగిలి గోవర్ధన్, రాజన్న, రాజు, మల్లయ్య, నర్సయ్య, భూమక్క, నాగరాణి, మల్లేశ్వరి, సునీత, సత్తవ్వ, దుబ్బయ్య, రాయమల్లు, సాగర్, కిష్టయ్య, యాదవ సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారుల ఎంపికకు గ్రామసభలు

జగిత్యాల/ధర్మపురి/మెట్‌పల్లి, మెట్‌పల్లిరూరల్/కోరుట్ల రూరల్/రాయికల్/మల్లాపూర్/కొడిమ్యాల/మల్యాల/ ధర్మపురిరూరల్/మారుతీనగర్/ పెగడపల్లి/కథలాపూర్/మేడిపల్లి, జనవరి 21: జిల్లా వ్యాప్తంగా మంగళవారం రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం గ్రామాల్లో గ్రామసభలు, పట్టణాల్లో వార్డు సభలు నిర్వహించారు. గ్రామసభల్లో అధికారులు అర్హుల జాబితాలు చదివి వినిపించారు. ప్రజల నుంచి అభ్యంతరాలను స్వీకరించారు. జాబితాలో పేరు రాని వారి నుంచి దరఖాస్తులను స్వీకరించారు. కొడిమ్యాల మండలం రామ్‌సాగర్‌లో నిర్వహించిన గ్రామసభకు అదనపు కలెక్టర్ గౌతమ్‌రెడ్డి హాజరయ్యారు. శనివారంపేట గ్రామంలో ఆకునూరి లింగయ్య అనే రైతు మాట్లాడుతూ రైతు భరోసా ఎప్పుడు ఇస్తారని అధికారులను ప్రశ్నించారు. జగిత్యాల పట్టణంలోని 19వ వార్డులో నిర్వహించిన వార్డు సభకు ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి హాజరై ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కోరుట్ల పట్టణంలోని రెండో వార్డులో మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వార్డు సభకు, మేడిపల్లి మండలం దమ్మన్నపేటలో ఏర్పాటు చేసిన గ్రామసభకు కలెక్టర్ సత్యప్రసాద్ హాజరై మాట్లాడారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని తెలిపారు. ధర్మపురి మండలం మగ్గిడిఎడపల్లిలో నిర్వహించిన గ్రామసభకు అదనపు కలెక్టర్ బీఎస్ లత హాజరై మాట్లాడారు. జాబితాలో పేరు రాని వారు తిరిగి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

బహుమతుల ప్రదానం

జగిత్యాల, జనవరి 21: జిల్లా కేంద్రంలోని యశస్వీ ఎలక్ట్రానిక్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన లక్కీడ్రాలో ఆల్టోకారు విజేతగా పనస లావణ్య నిలిచారు. అలాగే, జిల్లా కేంద్రంలోని పొన్నాల గార్డెన్స్‌లో మంగళవారం యశస్వీ సంక్రాంతి సంబురాల్లో భాగంగా మెగా బంపర్ డ్రా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి, వైద్యులు మోహన్ రెడ్డి, సతీశ్ కుమార్ పాల్గొని హాజరై డ్రా తీశారు. మొదటి బహుమతి యాసిన్ అందుకున్నారు. అలాగే, పలువురికి కన్సోలేషన్ బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో యశస్వీ ఎలక్ట్రానిక్స్ అధినేత కోటగిరి శ్రీనివాస్, యశస్వీ, ఆహ్వాన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

కొడిమ్యాల, జనవరి 21: మండలంలోని పూడూర్ గ్రామంలో జడ పరశురాములుకు చెందిన వ్యవసాయ భూమి వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్ఐ సందీప్ తెలిపారు. మృతుడి ఒంటిపై తెల్ల గీతల చొక్క ఉన్నట్లు పేర్కొన్నారు. తెలిసిన వారు సెల్ నంబర్ 87126 56831కు సమాచారం అందించాలని కోరారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

జగిత్యాల అర్బన్, జనవరి 21: నియోజకవర్గంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ పేర్కొన్నారు. పట్టణంలోని పలు వార్డుల్లో మంగళవారం ఆయన అభివృద్ధి పనులను ప్రారంభించిన అనంతరం వార్డు సభలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల మంజూరు నిరంతర ప్రక్రియ అన్నారు.

లింగంపేటలో పశువైద్య శిబిరం

మేడిపల్లి, జనవరి 21: భీమారం మండలం లింగంపేట గ్రామంలో మంగళవారం జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. 34 పశువులకు వెటర్నరీ డాక్టర్లు వెన్నెల, శ్రీనివాస్ వివిధ పరీక్షలు చేసి, మందులు అందజేశారు. ఈ సందర్భంగా వెటర్నరీ డాక్టర్ వెన్నెల మాట్లాడుతూ, పశువులకు వ్యాధులు సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పాడి రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ సిబ్బంది మురళి, గంగాధర్, రైతులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

జగిత్యాల టౌన్, జనవరి 21: జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు మిర్యాల నాగేందర్‌రెడ్డి, కార్యదర్శి అమరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను కలెక్టర్ సత్యప్రసాద్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఉద్యోగుల నిరంతర కృషితోనే జగిత్యాల జిల్లా అన్ని రంగాల్లో ముందు వరుసలో ఉందన్నారు. టీఎన్జీవో నాయకులు సాహెద్బాలు, మహమూద్, రాజేందర్, రాజేశం, సుగుణాకర్, మధుకర్, మమత, శైలజ, శ్రావణి, రాజశ్రీ, అరుణ, శ్రీనివాస్, స్వామి, హరిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

సూరమ్మ ప్రాజెక్టు పరిశీలన

కథలాపూర్, జనవరి 21: కథలాపూర్ మండలం కలికోట శివారులోని సూరమ్మ ప్రాజెక్టును సందర్శించడానికి బుధవారం రాష్ట్ర మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్ వస్తున్న నేపథ్యంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మంగళవారం సాయంత్రం జిల్లా అధికారులతో కలిసి పరిశీలించారు. మంత్రుల కార్యక్రమ ఏర్పాట్లను అధికారులతో చర్చించారు. ఆయన వెంట రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, నాయకులు నాగరాజు, తొట్ల అంజయ్య, వెలిచాల సత్యనారాయణ, గాజ ప్రభాకర్, వంగ మహేశ్, లోక రఘుపతిరెడ్డి, అధికారులు ఉన్నారు.

జగిత్యాల పట్టణాభివృద్ధే లక్ష్యం

జగిత్యాల, జనవరి 21: జగిత్యాల పట్టణాభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నామని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని 11,12, 29, 30వ వార్డుల్లో మంగళవారం ఆయన మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతితో కలిసి అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, జగిత్యాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, మున్సిపల్ మాజీ చైర్మన్ గిరి నాగభూషణం, కమిషనర్ చిరంజీవి, కౌన్సిలర్లు బాలే లత-శంకర్, నక్క జీవన్, పంబాల రాము, దుర్గయ్య, నాయకులు అబ్దుల్ ఖాదర్ ముజాహిద్, దుమాల రాజ్‌కుమార్, మేక పవన్, ప్రవీణ్ రావు, ఏఈ శరన్, తదితరులు పాల్గొన్నారు.

భార్యను వేధింపులకు గురి చేసిన భర్తపై కేసు

మల్యాల, జనవరి 21: భార్యను వేధింపులకు గురి చేసిన భర్తపై కేసు నమోదు చేసినట్లు మల్యాల ఎస్ఐ నరేశ్‌కుమార్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నూకపల్లి అర్బన్ కాలనీలో నివాసముండే పోలవేని నివేదితను భర్త పోలవేణి జయకృష్ణ నిత్యం తాగి వచ్చి కొట్టడంతో పాటు డబ్బులు ఇవ్వాలని వేధింపులకు గురి చేస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి జయకృష్ణ తాగి వచ్చి నివేదిత తలపై కొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. బాధితురాలి ఫిర్యాదు మేరకు జయకృష్ణపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేశ్‌కుమార్ తెలిపారు.

సెల్ టవర్ నిర్మాణాన్ని ఆపాలని వినతి

మెట్‌పల్లి, జనవరి 21: పట్టణంలోని హనుమాన్‌నగర్ కాలనీలో సెల్‌టవర్ నిర్మాణ పనులు ఆపాలని కాలనీ వాసులు మంగళవారం ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, మున్సిపల్ చైర్‌పర్సన్ రాణవేని సుజాతకు వినతి పత్రం అందజేశారు. సెల్‌టవర్ ఏర్పాటుతో పరిసర ఇండ్లల్లో ఉన్న కుటుంబాల సభ్యులకు రేడియేషన్ ద్వారా అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడ ఇల్లెందుల శ్రీనివాస్, గుంటుక గంగాధర్, నాగభూషణం, గోపీ, గణేశ్, రవి, సురేశ్, విజయ్, శ్రీరాములుగౌడ్, పరందాం తదతరులున్నారు.

విద్యార్థులకు అభినందన

కోరుట్ల రూరల్, జనవరి 21: జిల్లా కేంద్రంలోని దేవీశ్రీ గార్డెన్‌లో జిల్లా ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన జిల్లా స్థాయి ఉపన్యాస పోటీల్లో కల్లూర్ ఆదర్శ పాఠశాల విద్యార్థి కిరణ్మయి ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయికి ఎంపికైంది. కాగా, కిరణ్మయిని పాఠశాల ప్రిన్సిపాల్ మోహన్, ఉపాధ్యాయులు అభినందించారు.

సారంగాపూర్, జనవరి 21: జగిత్యాలలో మంగళవారం నిర్వహించిన జిల్లా స్థాయి తెలంగాణ ఇంగ్లిష్ ఒలింపియాడ్‌లో అర్పల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. ఆంగ్ల ఉపన్యాసంలో ఎండబెట్ల రక్షిత ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు జగిత్యాల జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించనుంది. ఇంగ్లిష్ గ్లామర్ టెస్ట్‌లో జుంజురు వర్ధిన్ జిల్లా స్థాయిలో 3వ స్థానంలో నిలిచాడు. విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అచ్యుత్ రెడ్డి, పీఈటీ సాబొద్దీన్, ఉపాధ్యాయులు రవి, శేఖర్, జహీరొద్దీన్, రాజనర్సయ్య, మమత, వేణుగోపాల్, మహేందర్, శ్యామ్, మాజీ ప్రజాప్రతినిధులు అభినందించారు.

మల్యాల, జనవరి 21: తాటిపల్లి గురుకుల పాఠశాల విద్యార్థి హర్షిక జిల్లా స్థాయి ఇంగ్లిష్ ఒలింపియాడ్ పరీక్షలో ప్రతిభ చూపి ప్రథమ స్థానంలో నిలిచినట్లు ప్రిన్సిపాల్ మానస ఒక ప్రకటనలో తెలిపారు. హర్షికను పాఠశాల ప్రిన్సిపాల్‌తో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

అవగాహన సదస్సు

మల్యాల, జనవరి 21: తక్కళ్లపల్లి గ్రామంలో మహిళా సంఘాల సభ్యులకు బేటీ బచావో-బేటీ పడావో కార్యక్రమంపై సఖీ సెంటర్ నిర్వాహకులు, ఐసీడీఎస్ అధికారులు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వీవోఏ కవిత, సఖీ సెంటర్ నిర్వాహకులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE PRL. DISTRICT JUDGE AT KARIMNAGAR
O.S.No. 47 OF 2018
Between:-
T. Venkataramana Reddy ...Plaintiff
AND
Bommakanti Sri Latha & Others ...Defendants
To,
D.3: Bommakanti Srikar, S/o. late Bommakanti Srinivas, aged 25 years, Occ: Software Engineer,
D.4: Bommakanti Srivan, S/o. late Bommakanti Srinivas, aged 22 years, Occ: Software Engineer,
Both are R/o. H.No. 3-1-11, Shiva Veedhi, Beside Shiva Temple, Jagtial town and district.
The above named plaintiff has instituted the above suit against you for recovery of money. The summonses sent to you through court and Reg. Post, are returned as un-serve,
Take notice that the above case is posted on **06-02-2025 at 10:30 a.m.,** for your appearance and written statement, if any?. You are hereby directed to appear in person or through Advocate, on the afore mentioned date and time and in case of making any default the suit will be determined in your absence.
// BY ORDER OF THE COURT //
Sd/- **E. MADHUSUDHAN RAO,** Advocate
Counsel for the Plaintiff
Karimnagar. Cell: 94400 70774

వరిలో మొగి పురుగును గుర్తించిన శాస్త్రవేత్తలు

జగిత్యాల టౌన్, జనవరి 21: జగిత్యాల మండలం కల్లెడ, బుగ్గారం మండలంలో వరి పొలాలను ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు మంగళవారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. వరికి మొగి పురుగు సోకినట్లు గుర్తించి, దాని నివారణకు గానూ ఎకరానికి 8 కిలోల కార్టాఫ్ హైడ్రో క్లోరైడ్ 4జీ గుళికలు చల్లుకోవాలని సూచించారు. అగ్గి తెగులు సోకినట్లయితే నివారణకు ఐసోప్రొథియోలిన్ 0.6 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పొలాస శాస్త్రవేత్తలు డాక్టర్ రజినీకాంత్, డాక్టర్ బలరాం, డాక్టర్ ఎన్ సాయినాథ్, స్వాతి, ఏఈవో శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

కుల బహిష్కరణ చేశారని ఎస్పీకి ఫిర్యాదు

జగిత్యాల రూరల్, జనవరి 21: జగిత్యాల రూరల్ మండలం బాలపల్లి గ్రామానికి చెందిన దొంగరి గంగారాం, ఒర్రె సాయవ్వ, జక్కుల శారద, బైరి రాధ తమను కుల బహిష్కరణ చేశారని మంగళవారం ఎస్పీ అశోక్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన గొల్లకుర్మ కులస్తులు ప్రతి సంక్రాంతి, ఉగాది పండుగలకు బోనాలు తీస్తారు. సంక్రాంతి సందర్భంగా తీసే బోనాలకు తమ కుటుంబాలకు సమాచారం అందించలేదని బాధితులు తెలిపారు. ఈ విషయమై గ్రామస్తుల సమక్షంలో కులస్తులను అడిగితే తమను కులం నుంచి బహిష్కరించారని ఆవేదన వ్యక్తం చేశారు. తమను కులం నుంచి బహిష్కరించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

విద్యార్థులు జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలి

జగిత్యాల టౌన్/మేడిపల్లి, జనవరి 21: విద్యార్థులు జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉండాలని జిల్లా విద్యాధికారి రాము సూచించారు. మేడిపల్లి మండలం కొండాపూర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఏర్పాటు చేసి ఫుడ్ ఫెస్టివల్‌ను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో లక్ష్మీనారాయణ, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు హమీద్, ప్రధానోపాధ్యాయుడు సత్తార్ ఖలీద్, ఉపాధ్యాయులు సుధాకర్, మనోహర్, రాజేందర్‌రెడ్డి, మల్లాల్‌రావు, చంద్రప్రకాశ్‌రెడ్డి, నరేశ్, రాజేందర్, పవన్, నర్సయ్య, రుక్సానా, సదాలక్ష్మి, సుమలత, నవ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

నింబితుడికి జీవిత ఖైదు శిక్షపై హర్షం

మెట్‌పల్లి, జనవరి 21: కోల్‌కతాలో వైద్యురాలిపై హత్యాచారానికి పాల్పడిన కేసులో నిందితుడికి జీవితఖైదు విధించడం పట్ల ఐఎంఏ మెట్‌పల్లి అధ్యక్షుడు డాక్టర్ గంగాసాగర్, ఉపాధ్యక్షుడు డాక్టర్ అమరేశ్వర్ హర్షం వ్యక్తం చేశారు. పట్టణంలోని ఐఎంఏ హాల్‌లో మంగళవారం జరిగిన కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సమావేశంలో కార్యవర్గ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రాన్ని సందర్శించిన అదనపు కలెక్టర్

కొడిమ్యాల, జనవరి 21: మండలంలోని నాచుపల్లి జేఎన్టీయూ కళాశాలలో బుధవారం నిర్వహించే జేఈఈ పరీక్షా కేంద్రాన్ని మంగళవారం అదనపు కలెక్టర్ గౌతమ్‌రెడ్డి, అడిషనల్ ఎస్పీ భీమ్‌రావు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా సీసీ కెమెరాల పని తీరు, టెబుల్స్, పరీక్షా కేంద్రం గదులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్, సీఐ నీలం రవి, ఎస్ఐ సందీప్, ఎంపీడీవో స్వరూప, తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

కొడిమ్యాల, జనవరి 21: నాచుపల్లి ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని మంగళవారం అదనపు కలెక్టర్ గౌతమ్‌రెడ్డి పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలని నిర్వాహకులకు సూచించారు. మరుగుదొడ్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రమేశ్, ఎంపీడీవో స్వరూప, ప్రధానోపాధ్యాయులు, కార్యదర్శి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం ఢీకొని ఒకరికి గాయాలు

సారంగాపూర్, జనవరి 21: మండలంలోని లక్ష్మీదేవిపల్లి గ్రామానికి చెందిన పసుల లక్ష్మణ్ మంగళవారం నడుచుకుంటూ వెళ్తుండగా, అదే గ్రామానికి చెందిన మానుక అఖిల్ ద్విచక్ర వాహనంపై అతివేగంగా వచ్చి ఢీకొట్టడంతో గాయాలయ్యాయి. లక్ష్మణ్ భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ దత్తాద్రి తెలిపారు.

రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

కొడిమ్యాల, జనవరి 21: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు చొక్కాల వైష్ణవి, సామల్ల పూజిత, మచ్చ నవిత రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీల్లో ప్రతిభ చూపి పతకాలు సా